క్లుప్తంగా

శివాలయం హుండీ ఆదాయం రూ.1.19లక్షలు

మధిర: మధిరలోని శ్రీ మృత్యుంజయ స్వామి(శివాలయం) హుండీల్లో భక్తుల సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. ఆలయ ఈఓ జగన్‌మోహన్‌రావు, దేవాదాయ శాఖ అధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యాన చేపట్టిన లెక్కింపులో రూ.1,19,417 ఆదాయం నమోదైంది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ త్వరలో జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

ప్రతిష్ఠ విగ్రహాలకు అభిషేకాలు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని అయ్యగారిపేటలో ఈ నెల 7న రామాలయంలో ప్రతిష్ఠించనున్న విగ్రహాలకు బుధవారం శాస్త్రోక్తంగా అభిషేకాలు, హోమ పూజలు నిర్వహించారు. త్రిదండి చిన్నజీయర్‌స్వామి మఠానికి చెందిన వంశీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ఏడుగురు రుత్వికులతో విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణయ్య, నాగప్రసాద్, చంద్రశేఖర్, నర్సింహారావు, శ్రీనివాస్, పవన్, వేణు, రామారావు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

వైరా: ఈ నెల 2వ తేదీన ఖమ్మంలో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో కటాస్ విభాగంలో వైరా శాంతినగర్ మేరీ ఇమ్మాక్యులేట్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ యమున తెలిపారు. అండర్-12, 14, కటాస్ విభాగంలో పి.అభిలాష్, టి.జీవన్, చర్విత, మరి కొంత మంది విద్యార్థులు మెడల్ సాధించారు. సిస్టర్ జెసింత, కరాటే మాస్టర్ వై.నరేష్, విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన

మధిర: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరసన కార్యక్రమంలో భాగంగా మధిరలో ఆర్టీసీ డిపో కార్మికులు బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూఎఫ్, ఎస్‌డబ్ల్యూయూ యూనియన్ నాయకులు పద్మావతి, నాగేశ్వరరావు మాట్లాడారు. ఆర్టీసీలో కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేసి, గుర్తింపు ఎన్నికలు జరపాలని కోరారు. కార్యక్రమంలో కోటయ్య, నాగరాజు, అనూష, ఎస్ ఎస్ రావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి

కారేపల్లి: తెలంగాణ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని టీపీసీసీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల అన్నారు. బుధవారం మండల పరిధిలోని గిద్దవారిగూడెం గ్రామంలో మండల కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు ఈసాల ఛాయాదేవి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలపాలన్నారు. అంతకు ముందు గిద్దవారిగూడెం గ్రామానికి చెందిన మాజీ కాంగ్రెస్ యువజన నాయకుడు రుద్రకుమార్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు ఐలయ్యయాదవ్, శ్రీనివాసరావు, జగన్నాథం, భీముడు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై కాంగ్రెస్ సంబరాలు

ఎర్రుపాలెం: ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలుకు నిర్ణయించడంపై బుధవారం మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు నిర్వహించుకున్నారు. రింగ్ సెంటర్ నుంచి గాంధీ సెంటర్ మీదుగా అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి.. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహారావు, పీసీసీ మెంబర్ ప్రతాపరెడ్డి, నాయకులు లక్ష్మణరావు, ఇస్మాయిల్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాలాభిషేకం..

తల్లాడ: ప్రభుత్వం అసెంబ్లీలో కులగణన, బీసీలకు 42శాతం ప్రాధాన్యతనిచ్చి, ఎస్సీ వర్గీకరణను అంగీకరిస్తూ బిల్లు పెట్టినందుకు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి బుధవారం పాలాభిషేకం చేశారు. స్థానిక రింగ్ రోడ్డు సెంటర్‌లో సంబరాలు జరుపుకున్నారు. బాణాసంచా కాల్చారు. స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుధాకర్, కాంగ్రెస్ నాయకులు రాము, రఘుపతిరెడ్డి, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు రాఘవ తదితరులు పాల్గొన్నారు.

నివాళి..

తల్లాడ: మండలంలోని వెంగన్నపేట గ్రామానికి చెందిన పాఠశాల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కల్యాణపు సాంబశివరావు భౌతికకాయాన్ని ఎమ్మెల్సీ తాతా మధు, సండ్ర వెంకటవీరయ్య బుధవారం సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తల్లాడ మాజీ ఎంపీపీ శ్రీనివాసరావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు వీరమోహన్‌రెడ్డి, వెంకట్‌లాల్, చలపతిరావు, మురళీధర్‌రావు పాల్గొన్నారు.

అభ్యర్థుల ఎంపిక నిర్ణయం మీదే..

'స్థానిక' ఎన్నికలకు అధికార పార్టీ సన్నద్ధత

- మండలాల వారీగా సమావేశాలు..
- ఇంకా రంగంలోకి దిగని ప్రతిపక్షం

సత్తుపల్లి: పార్టీ శ్రేణులను స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం చేసేలా కాంగ్రెస్ నేతలు మండలాల వారీగా భేటీలు నిర్వహిస్తున్నారు. ప్రజల్లో పేరున్నోళ్లకే టికెట్ వస్తుందని, అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఎంపిక మాదిరిగానే సర్వే చేపట్టి క్షేత్రస్థాయిలో శ్రేణుల సూచన మేరకు టికెట్లు ఖరారు చేస్తామని చెబుతున్నారు. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చే అవకాశముందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇటీవల ప్రకటించిన విషయం విదితమే. ఇందులో భాగంగానే సత్తుపల్లి నియోజకవర్గంలోని ఐదు మండలాల కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆ పార్టీ నేత దయానంద్ సమావేశమవుతున్నారు. గ్రామాల వారీగా పార్టీ స్థితిగతులు, విజయ అవకాశాలపై సమీక్షలు మొదలుపెట్టారు. తొలుత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరిగే అవకాశముండగా ఆ దిశగా పార్టీ కేడర్‌ను సిద్ధం చేయడంపై అధికార పార్టీ దూకుడుగా ముందుకెళ్తోంది. ఇవి పార్టీ గుర్తులతో జరిగే ఎన్నికలు కావడంతో ప్రతీ సీటును ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని నిర్ణయించినట్లు చెబుతున్నారు.

రిజర్వేషన్లపై ఉత్కంఠ

ఎన్నికల నోటిఫికేషన్ ఇంకా రాకున్నా రిజర్వేషన్లపై చర్చ జరుగుతోంది. మార్పులు, చేర్పుల దృష్ట్యా ఈసారి రిజర్వేషన్ ఎలా ఉంటుందోనని పార్టీల శ్రేణులు అంచనాలు వేస్తున్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో ఈసారి అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి ఆశావాహుల జాబితా భారీగానే ఉండడంతో రిజర్వేషన్లు ప్రకటిస్తేనే అభ్యర్థుల ఎంపిక కొలిక్కి వచ్చే అవకాశముంది. ఇప్పటికే కొన్నిచోట్ల అధికార పార్టీలోకి వలసలు మొదలయ్యాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పార్టీలో చేరేందుకు పలువురు ఉత్సాహం చూపినా కొందరి విషయంలో అయిష్టత వ్యక్తం చేశారు. 2019లో ముందు జీపీ ఎన్నికలు, ఆతర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించారు. సర్పంచ్ ఎన్నికల్లో ఓడిన వారికి ఎంపీటీసీలుగా టిక్కెట్లు ఇచ్చి గెలిపించుకున్నారు. కానీ ఈసారి ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరిగే అవకాశమున్నందున పార్టీలన్నీ అభ్యర్థుల ఎంపికను పక్కనబెట్టి బలాబలాలపై దృష్టి సారించాయి.

వేచిచూసే ధోరణిలో ప్రతిపక్షం

ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలపై ఇప్పటివరకు ఎలాంటి సమావేశాలు నిర్వహించలేదు. గత ఎన్నికల్లో ఐదు జెడ్పీటీసీ, ఐదు ఎంపీపీలు, మెజార్టీ సర్పంచ్‌లను బీఆర్‌ఎస్ శ్రేణులు గెలుచుకున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినప్పటి నుంచి కొందరు ముఖ్యనేతలు పార్టీని వీడి అధికార కాంగ్రెస్‌లో చేరిపోయారు. అయితే బీఆర్‌ఎస్‌కు కేడర్ ప్రతీ గ్రామంలో ఉండటంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ ఖాయమనే చర్చ జరుగుతుంది. కొన్నిచోట్ల కాంగ్రెస్‌లో ఉన్న వర్గ విభేదాలను తమకు అనుకూలంగా మలుచుకొని పార్టీని విజయపథం వైపు నడిపించే ఆలోచనలో ప్రతిపక్షం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఈసారి పోటీలో బీజేపీ

ఈసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ మెజార్టీ స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో నామమాత్రపు బలమే చూపించినా పార్లమెంట్ ఎన్నికలకు వచ్చేసరికి గ్రామాల్లో బలమైన ఓటు బ్యాంకు నమోదైంది. ఈ అంశం కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌లో చర్చకు దారి తీసింది. కొన్ని గ్రామాల్లోనైతే మెజార్టీ ఓట్లు రావడం తమ పార్టీ విస్తరణకు సంకేతమని బీజేపీ నేతలు చెబుతున్నారు. ఈనేపథ్యాన స్థానిక సంస్థల ఎన్నికల వేళ మెజార్టీ స్థానాల్లో పోటీకి ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

విజయమే లక్ష్యంగా ప్రజల్లోకి వెళ్లండి

స్థానిక సంస్థల్లో విజయమే లక్ష్యంగా ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ పార్టీశ్రేణులకు సూచించారు. సత్తుపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో సత్తుపల్లి పట్టణ, మండల కాంగ్రెస్ కార్యకర్తలతో బుధవారం సమావేశమైన ఆయన మాట్లాడుతూ.. వంద శాతం ఫలితాలు వచ్చేలా ప్రతీ కార్యకర్త పని చేయాలన్నారు. రిజర్వేషన్, పనితీరు ఆధారంగా టికెట్లు, పదవులు వస్తాయని తెలిపారు. కాగా, వేంసూరు మండలం కందుకూరుకు చెందిన డీసీసీబీ డైరెక్టర్ గొర్ల సంజీవరెడ్డి దయానంద్ సమక్షాన కాంగ్రెస్‌లో చేరారు.


డీసీసీబీ డైరెక్టర్ సంజీవరెడ్డికి పార్టీ కండువా కప్పుతున్న కాంగ్రెస్ నేత దయానంద్

ఈ సమావేశంలో చల్లగుళ్ల నర్సింహారావు, తోట సుజలరాణి, గాదె చెన్నారావు, ఉడతనేని అప్పారావు, వెల్ది జగన్మోహన్‌రావు పాల్గొన్నారు.

పన్నుల లక్ష్యాలను చేరుకోవాలి


మాట్లాడుతున్న కమిషనర్ నర్సింహ

సత్తుపల్లిటౌన్: ఈ ఆర్థిక సంవత్సరం మున్సిపాలిటీ ఆస్తిపన్ను లక్ష్యాన్ని సాధించేందుకు యంత్రాంగం చర్యలు చేపట్టాలని సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ కొంద్రు నర్సింహ ఆదేశించారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లు, బిల్‌కలెక్టర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మొండిబకాయిల జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. తాగునీటి ఎద్దడి ప్రాంతాలను గుర్తించి వేసవి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. పారిశుద్ధ్య చర్యలను మెరుగు పర్చాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మేనేజర్ మైసా శ్రీనివాసరావు, ఆర్‌ఐ లోకేష్, ఏఈ సురేష్, వార్డు ఆఫీసర్లు, బిల్‌కలెక్టర్లు పాల్గొన్నారు.

పరిమితికి మించి ఎక్కించొద్దు..

ముదిగొండ: ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించొద్దని సీఐ మురళి అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా బుధవారం పోలీస్ సిబ్బంది ముదిగొండ సెంటర్‌లో ప్రయాణికులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా సీఐ మురళి మాట్లాడుతూ.. వాహదారులు తమకు సంబంధించిన పత్రాలను కలిగి వాహనాలను నడపాలన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పని సరిగా హెల్మెట్‌లు ధరించాలని, కూలీలను ఆటోల్లో, ట్రాక్టర్లలో తరలించొద్దన్నారు. నిబంధనలు పాటించనివారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఎస్సెస్సీ విద్యార్థులకు అల్పాహారం


విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న దృశ్యం

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల ఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు అల్పాహార కార్యక్రమాన్ని హెచ్‌ఎం భాగ్యలక్ష్మి ప్రారంభించి మాట్లాడారు. దాతల సహకారంతో అల్పాహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నాగేశ్వరరావు, మురళి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

డెస్క్ బెంచీలు అందజేసిన పూర్వ విద్యార్థులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం గ్రామంలోని జిల్లా ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు గద్దల కిరణ్, రమేష్ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా డెస్క్ బెంచీలను వితరణగా అందించారు. బుధవారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక సమావేశంలో బెంచీలను పాఠశాల హెచ్‌ఎం నాగులంచ జ్యోతిశ్రీకి అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలకృష్ణ, వత్సలాదేవి, పద్మజ, సోమలక్ష్మి తదితరులున్నారు.

పంచాయతీ కార్యదర్శికి బ్రెయిన్‌స్ట్రోక్

బోనకల్: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం.రాధాకృష్ణ బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యారు. ఆయన మంగళవారం పంచాయతీ ఎన్నికలకు సంబంధించి బ్యాలెట్ పేపర్ల పరిశీలన అనంతరం ఇంటికి వెళ్లగా అర్ధరాత్రి ఒక్కసారిగా బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కుప్పకూలాడు. దీంతో ఆయనను చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి ఆపై హైదరాబాద్ తరలించారు. ఎంపీడీఓ రమాదేవి, ఎంపీఓ శాస్త్రి, పలువురు కార్యదర్శులు ఖమ్మం ఆస్పత్రిలో రాధాకృష్ణను పరామర్శించారు.

పాఠశాలకు విరాళం..

వైరారూరల్: మండలంలోని రెబ్బవరం జెడ్పీహెచ్‌ఎస్ గణిత ఉపాధ్యాయుడు నరసింహారావు.. పాఠశాలలోని విద్యార్థులకు తాగునీరు అందించేందుకు రూ.8వేల ఆర్థిక సాయం అందించారు. దీంతో నరసింహారావును ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులకు పోషకాహారం



విద్యార్థులకు చిక్కీలు, మిల్లెట్ బిస్కెట్లు అందిస్తున్న దృశ్యం

కల్లూరు: కల్లూరు ఎంపీపీఎస్ పాఠశాలలో ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా మధ్యాహ్నం 3.30 గంటల నుంచి 4.15 వరకు పిల్లలకు స్టడీ అవర్ ఏర్పాటు చేసి చదివిస్తున్నారు. ఈ సందర్భంగా ఈదే పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి వరకా రామారావు చొరవతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.40 వేల విలువైన చిక్కీలు, మిల్లెట్ బిస్కెట్లు తదితర పౌష్టికాహారాన్ని అందించడం జరిగింది. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగపద్మ, ఉపాధ్యాయులు రామారావు, రమాదేవి, వెంకటేశ్వరరావు, అనితకుమారి, ఫణి శంకర్‌రెడ్డి స్ఫూర్తి ఫౌండేషన్ సేవలను కొనియాడారు.

ఫిజియోథెరపీ సేవలు వినియోగించుకోవాలి

చింతకాని: పాక్షిక పక్షవాతం, శారీరక అంగవైకల్యం కలిగిన పిల్లల కోసం నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోవాలని ఫిజియోథెరపీ వైద్యురాలు వల్లూరి వసంత తెలిపారు. బుధవారం మండలంలోని లచ్చగూడెం భవిత కేంద్రంలో.. అవసరమైన దివ్యాంగ పిల్లలకు ఫిజియోథెరపీ వైద్య సేవలు అందించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్పీలు కేవీఎస్ కృష్ణారావు, భూక్యా దస్లీ, భవిత కేంద్రం సంరక్షకురాలు లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఫైర్‌స్టేషన్, పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేయండి


సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రి పొంగులేటితో కలిసి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి: సత్తుపల్లి నియోజకవర్గంలోని కల్లూరు మండల కేంద్రంలో ఫైర్ స్టేషన్, నూతన పాలిటెక్నికల్ కళాశాలను మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. బుధవారం రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డికి ప్రతిపాదనలు అందించారు.

సన్మానం

మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్‌కు..


ముళ్లపాటి దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

వైరా: గత ఐదేళ్లుగా వైరా మున్సిపాలిటీ వైస్ చైర్మన్‌గా పని చేసిన ముళ్లపాటి సీతారాములు దంపతులను వైరా శ్రీ సాయి గజానన ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఊరుకొండ శ్రీనివాసరావు, ముళ్లపాటి రంగారావు, కొమిరిశెట్టి శ్రీధర్, రామశేషారెడ్డి, నరసింహారావు, గోపిశెట్టి నరసింహారావు, సంపత్ కుమార్, సుధాకర్, రాజేశ్వరరావు, శ్రీనివాసరావు, రామచంద్రయ్య, పుష్పావతి,అనిత, విజయలక్ష్మి, అపర్ణ, వసంత లక్ష్మి పాల్గొన్నారు.

మిట్టపల్లి బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌కు..


భానుప్రసాద్ దంపతులను సన్మానిస్తున్న సిబ్బంది

తల్లాడ: మండలంలోని మిట్టపల్లి బ్రాంచ్ పోస్టు మాస్టర్ టీ.వీ.భానుప్రసాద్‌ను బుధవారం ఘనంగా సన్మానించారు. తల్లాడ పోస్టాఫీస్‌లో నిర్వహించిన సన్మాన సభలో.. భానుప్రసాద్ దంపతులను పూలమాల, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో వీరభద్రరావు, సత్యప్రసాద్, రమేష్, నరసింహారావు, సిద్దారెడ్డి, శ్రీను, సురేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వమే బాధ్యత వహించాలి

కొణిజర్ల: మార్కెట్‌లో మిర్చి ధర పతనానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు షేక్ ఖాసీమ్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని గుబ్బగుర్తిలో మిర్చి కల్లాలను ఆ సంఘం నాయకులు పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, రైతు కూలీలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆన్‌లైన్ మోసాల బారిన పడొద్దు


మాట్లాడుతున్న సైబర్ క్రైమ్ డీఎస్పీ ఫణీంధర్

కొణిజర్ల: విద్యార్థులు ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా జాగ్రత్త పడడమే కాక మరికొందరికి అవగాహన కల్పించాలని సైబర్ క్రైమ్ డీఎస్పీ సీహెచ్ ఆర్‌వీ.ఫణీంధర్ సూచించారు. తనికెళ్లలోని విజయ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే మెయిళ్లు, మెసేజీలకు స్పందించొద్దని, ఉచిత ఆఫర్లు, వర్క్ ఫ్రమ్ హోమ్ పేరుతో ఫోన్ చేసే వారిని నమ్మొద్దని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడితే 1930 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని చెప్పారు. సైబర్ క్రైమ్ ఎస్‌ఐ విజయ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.చిన్నయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆయేషా తరుణమ్, డీన్ శ్రీనివాసరావు, ఏఓ డాక్టర్ ఫరీద్ బాబా, సైబర్ క్రైమ్ విభాగం ఉద్యోగి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్వీయ రక్షణపై దృష్టి సారించాలి..


అవగాహన కల్పిస్తున్న సోనీప్రైమ్‌లీనా

ఏన్కూరు: మండల కేంద్రంలోని ఉషోదయ పాఠశాలలో పిల్లలపై పెరుగుతున్న లైంగిక దాడులు, అత్యాచారాలపై విద్యార్థులకు బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ అధికారి సోనీప్రైమ్‌లీనా బుధవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు నర్సింహారావు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిని అధిగమించాలి



మాట్లాడుతున్న డాక్టర్ పృథ్వీరాజ్ నాయక్

మధిర: పరీక్షల సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమించాలని దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పృథ్వీరాజ్ నాయక్ తెలిపారు. బుధవారం మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ జయదాస్ అధ్యక్షతన విద్యార్థులకు నిర్వహించిన 'టెలి మానస్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు రాయబోయే పరీక్షలకు ఏవిధంగా సిద్ధంగా ఉండాలి తదితర విషయాలపై అవగాహన కల్పించారు. అవసరమైతే టెలి మానస్ టోల్ ఫ్రీ నంబర్ 14416 కు ఫోన్ చేసి వైద్యుల సూచనలు, సలహాలు పొందాలన్నారు. వారికి తగిన మందులను ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ లంకా కొండయ్య ఆలపించిన జానపద గేయాలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు..


అవగాహన కల్పిస్తున్న రాణాప్రతాప్

కారేపల్లి: విద్యార్థులు ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని మోటివేషనల్ స్పీకర్ రాణాప్రతాప్ అన్నారు. బుధవారం కారేపల్లి కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయంలో ఎస్‌ఆర్‌ఐ ఫౌండేషన్ సౌజన్యంతో 9వ, 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, మోటివేషన్ తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ స్పెషలాఫీసర్ జాన్సీసౌజన్య, ఉపాధ్యాయులు అన్నపూర్ణ, విజయలక్ష్మి, కవిత, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

ముదిగొండ: మండలంలోని బాణాపురం, ముదిగొండ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలను బుధవారం ఎంఈఓ రమణయ్య పరిశీలించారు. ఆయా పాఠశాలల్లోని గ్రంథాలయం, కంప్యూటర్ రూమ్, సైన్స్ ల్యాబ్ లను సందర్శించి వాటి నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు వెంకట్రామిరెడ్డి, శాంతి, ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేజీబీవీలో తహసీల్దార్..

మండలంలోని న్యూలక్ష్మీపురంలోని కేజీబీవీ పాఠశాలను తహసీల్దార్ సునీత సందర్శించారు. విద్యార్థుల సమస్యలు తెలుసుకొని, వారితో కలిసి భోజనం చేశారు. వంట గదులను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారిణి ఇందిర, ఆర్‌ఐలు ప్రసన్నకుమార్, వహిదా సుల్తానా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ సునీత

10న కేంద్ర బడ్జెట్‌పై మహాధర్నా


మాట్లాడుతున్న గోపాలరావు

ముదిగొండ: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఈ నెల 10న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు బండి పద్మ, మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు తెలిపారు. బుధవారం ముదిగొండలోని మచ్చా వీరయ్య భవనంలో పంద్రకోల రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇది దేశ ప్రజల బడ్జెట్ కాదని, ఎన్నికల బడ్జెట్ అని అన్నారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి పురుషోత్తం, నాయకులు అరుణ, ప్రభావతి, నాగేశ్వరరావు, ఉపేందర్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై నిరసన..


పెనుబల్లి: నిరసన తెలుపుతున్న నాయకులు

తల్లాడ/పెనుబల్లి: కేంద్ర ప్రభుత్వం ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతుల నకళ్లను బుధవారం తల్లాడలో, పెనుబల్లిలో కార్మిక, కర్షక సంఘాల ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకుడు అయినాల రామలింగేశ్వరరావు మాట్లాడుతూ.. దేశ జనాభాలో అధిక శాతం ఉన్న కార్మిక, కర్షకులకు బడ్జెట్లో అన్యాయం జరిగిందన్నారు. అదే విధంగా సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వ పాలనపై పోరాటాలు చేయాల్సిన సమయం ఆసన్నమైందంటూ.. ఎర్రజెండాలు చేతబూని నిరసన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమాలల్లో రైతు సంఘం నాయకులు మోహన్‌రావు, కృష్ణయ్య, నరేష్, భరత్, బిక్షం, జానీ, రాంబాబు, రామారావు, సైదులు, వ్య.కా.సం జిల్లా కమిటీ సభ్యుడు తిరుపతిరావు, నరసింహారావు, అరుణ్‌ప్రతాప్, స్వామి, రాజు, దుర్గయ్య, చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ మాజీ చైర్మన్ పరామర్శ..


మల్లికార్జున్‌రెడ్డిని పరామర్శిస్తున్న కమల్‌రాజ్, నాయకులు

ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలు మాజీ ఎంపీటీసీ కుడుముల మల్లికార్జున్‌రెడ్డి ఇటీవల మోకాలికి శస్త్రచికిత్స చేయించుకున్నారు. దీంతో బుధవారం ఆయనను జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ పరామర్శించారు. మార్కెట్ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ శీలం కవిత, నాయకులు శేగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, యన్నం శ్రీనివాసరెడ్డి, సంక్రాంతి కృష్ణారావు,యన్నంశెట్టి అప్పారావు, శ్రీపాలశెట్టి తిరుపతిరావు, యరమల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

10న నులిపురుగుల నివారణ దినోత్సవం

చింతకాని: ఈ నెల 10న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ కూరపాటి అనంతరాజు తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల వ్యాప్తంగా 1నుంచి 19 సంవత్సరాల వయస్సుగల పిల్లలను 6,670మందిని గుర్తించడం జరిగిందని, వారందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు మింగించాలన్నారు. ఈ సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో మండల వైద్యాధికారి డాక్టర్ ఆల్తాఫ్, మండల విద్యాశాఖాధికారి వీరపనేని శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సీడీపీఓ కమలప్రియ, ఏసీడీపీఓ శివమ్మ, సూపర్‌వైజర్లు పద్మావతి, విజయలక్ష్మి, సీహెచ్‌ఓ వీరేందర్, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణారావు, ఏఎన్‌ఎం హేమలత తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మండల అధికారులు